క్లుప్తంగా

50 శాతం రాయితీతో జనుము, జీలుగ విత్తనాలు

పుత్తూరు: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 50 శాతం రాయితీతో జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్టు స్థానిక వ్యవసాయాధికారి ఎస్.కోదండయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 కేజీల సంచులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు ఒరిజినల్ చూపించి, వారి కుటుంబ సభ్యులు ఎవరైనా జనుము, జీలుగలు పొందవచ్చని పేర్కొన్నారు.

ఆరోగ్యం కాపాడుకోవాలి



గర్భిణికి పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం: మండలంలోని గర్భిణులు, బాలింతల తమ ఆరోగ్యం కాపాడుకోవాలని, ఇందుకు పలు జాగ్రత్తలు తీసుకుని, వైద్యుల సలహాలు పాటించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆయన సందర్శించారు. గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆరోగ్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ చిన్నారులకు వేయాల్సిన టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. అప్పుడే చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవం చేయాలని, అప్పుడే మాతా శిశు మరణాల నివారణ సాధ్యమన్నారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యులు

తిరుపతి(తుడా): ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ తెలిపారు. వైద్య కళాశాలలో బుధవారం ఎస్వీ వైద్య కళాశాల, రుయా ఆస్పత్రి, చిన్న పిల్లల విభాగం వైద్యాధికారులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.రవిప్రభు, ఎస్వీ వైద్య కళాశాల క్యాన్సర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నోడల్ అధికారి డాక్టర్ వై.వెంకట్ లక్ష్మీ, ఎస్వీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్లు రోజారమణి, చండీప్రియ, సునీత పాల్గొన్నారు.

దివ్యాంగులను భవిత కేంద్రంలో చేర్పించండి



ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను సేకరిస్తున్న అధికారులు

పాకాల : ప్రత్యేక అవసరాలు గల పిల్లలను సాధారణ పిల్లల మాదిరిగానే పాఠశాలల్లో చేర్పించవచ్చని జిల్లా సమగ్ర శిక్షా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ఇరంగారిపల్లి, శ్రీనివాసపురం, ముద్దలపల్లి, ఉప్పువంక, దేశిరెడ్డిపల్లి, గాంధీనగర్ గ్రామాల్లో సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ గత నెల నుంచి దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రంలో నమోదు చేసే సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ పిల్లలు సాధారణ పిల్లల్లాగే మెలగలేరని, వారిని భవిత కేంద్రంలోనే చేర్పించాలని సూచించారు. దివ్యాంగులకు అర్హత కలిగిన భవిత కేంద్రంలోని సహిత ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సాధారణ పిల్లల మాదిరిగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. వీరికి అందించే ప్రత్యేక శిక్షణ, ఉచిత ఉపకరణాలు పొందాలని తెలిపారు. దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా సమగ్ర శిక్ష ప్రణాళిక సమన్వయకర్త రామచంద్రారెడ్డి, ఎంఈవో బాబ్జి, సహిత ఉపాధ్యాయులు మునికృష్ణారెడ్డి, సుందరి పాల్గొన్నారు.

గాలీవాన ధాటికి ట్రాన్స్‌కోకు నష్టం



రెడ్డిగుంటలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ పరిధిలో మంగళవారం గాలీ వాన ధాటికి ఆశాఖకు నష్టం వాటిల్లింది. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్ దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మొత్తం కరెంటు స్తంభాలు 7, సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు 3, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఒకటి, 180 మీటర్లు కేబుల్స్ దెబ్బతిన్నాయని ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. దీంతోశాఖకు రూ.6 లక్షలు నష్టం వచ్చిందని చెప్పారు. సిబ్బంది పునరుద్ధరణ పనులకు పూనుకున్నారు.

నేత్రపర్వంగా రథోత్సవం



అశ్వవాహనంపై విహరిస్తున్న వేణుగోపాలస్వామి



రథంపై విహరిస్తున్న రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలుడు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజైన బుధవారం రథోత్సవం కనులపండువగా సాగింది. స్వామివారు రుక్మిణీ, సత్యభామ సమేతుడై దివ్య రథంపై కొలువుదీరి, గ్రామంలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి, వైఖానస ఆగమోక్తంగా నిత్యకైంకర్యాలు నిర్వహించారు. తోమాల, అర్చన, కొలువు, సహస్రనామార్చన, శాత్తుమొర జరిపారు. 9 గంటలకు రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారిని పట్టు పీతాంబరాలు, మరకత మాణిక్యాలు, వజ్రవైఢ్యూరాలతో శోభాయమానంగా అలంకరించి రథంపై అధిష్టింపజేశారు. అశేష భక్తజనుల గోవిందనామస్మరణల నడుమ స్వామి, అమ్మవార్ల రథోత్సవం గ్రామ వీధుల్లో సాగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, రథంపై మిరియాలు, ఉప్పు చల్లుతూ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. భజన బృందాలు, కోలాట ప్రదర్శనలు, చెక్కభజనలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు ఆలయ ఆవరణలో ఊంజల్ మండపానికి చేరుకున్న స్వామివారికి ఊంజల్ సేవ చేశారు.

అశ్వవాహనంపై వేణుగోపాలుడి రాజసం

రాత్రి స్వామివారు అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో విహరించారు. భక్తులు కర్పూర హారతులిచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయాధికారి సురేష్‌కుమార్, షరాబ్ బాబు సురేష్, కంకణభట్టు నారాయణదాసరి, వేదపండితులు గోపాలాచారి, తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన చక్రస్నానం గురువారం ఉదయం 9 గంటలకు రాజరాజేశ్వరీదేవి ఆలయ సమీపంలోని స్కంధపుష్కరిణిలో నిర్వహించనున్నట్లు ఆలయాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. అలాగే ఉదయం 6 నుంచి 7 గంటల వరకు పల్లకి ఉత్సవం, 7.30 నుంచి 8.30 గంటల వరకు పుష్కరిణి వద్ద ఉభయ నాంచారి సమేత స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం 5.30 నుంచి 7 గంటల నడుమ ధ్వజావరోహణం కార్యక్రమం జరగనుంది. దీంతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.



కోలాటాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా



పురుషోత్తం

వెదురుకుప్పం: మండలంలోని చిన్నబొమ్మయ్యపల్లెకు చెందిన గాండ్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మేలిపాటి పురుషోత్తం తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ తాను రాజీనామా చేసినట్లు పురుషోత్తం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తన రాజీనామాను ఫ్యాక్స్ ద్వారా సీఎస్, అమరావతికి పంపినట్లు చెప్పారు. సామాజిక న్యాయం కేవలం మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని స్పష్టం చేశారు. వివిధ కార్పొరేషన్‌ల ఏర్పాటు చేసి అణగారిన వర్గాలకు పెద్ద పీట వేశారన్నారు. తన జీవితాంతం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి వెంటే నడుస్తానన్నారు. వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా



సుగుణమ్మ

కార్వేటినగరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు సుగుణమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పించిన డైరెక్టర్ పదవిలో రెండేళ్లపాటు కొనసాగానని, ఇటీవల తమ పదవీ కాలం ముగియడంతో మళ్లీ తమ పదవీకాలాన్ని పొడిగించారన్నారు. జూన్ 4వ తేదీ వెలువడిన ఎన్నికల ఫలితాల్లో టీడీపీ గెలుపొందడంతో నైతిక బాధ్యత వహిస్తూ తాము పదవికి రాజీనామా చేశానని చేశానని చెప్పారు. తన రాజీనామా లేఖను చీఫ్ సెక్రటరీకి పంపానని చెప్పారు.

ఘనంగా గంగమ్మ నిమజ్జనం



నిమజ్జనానికి సిద్ధంగా గంగమ్మ

తవణంపల్లె: దిగువమోదలపల్లెలో బుధవారం సాయంత్రం గంగమ్మ తల్లిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. దిగువమోదలపల్లెలో గంగమ్మ తల్లికి గ్రామస్తులులు భక్తిప్రపత్తులతో అభిషేకం, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన



మొక్కలు నాటుతున్న ఎంఈవో శ్రీదేవి

నగరి: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో శ్రీదేవి తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నగరి మున్సిపాలిటీ పరిధిలోని చింతలపట్టెడ, వినాయకపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఆవరణలో మొక్కలను నాటారు. మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను విశదీకరించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, వాటి ఆవశ్యకతను వివరించారు. ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. పిల్లలకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పర్యావరణానికి సంబంధిత వివిధ నానాధాలతోగల ప్లకార్డులతో పిల్లలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నమశ్శివాయం, పాఠశాల ఉపాధ్యాయులు కె.బాబు, మీరయ్య పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



మాట్లాడుతున్న చిట్టిబాబు

పాలసముద్రం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని జీవ వైవిధ్య మండల కమిటీ సభ్యుడు చిట్టిబాబు తెలిపారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సౌజన్యంతో, రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఆముదాల, వీఆర్ కుప్పం పంచాయతీల్లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ వర్షాలు కురవాలంటే మొక్కలు నాటాలన్నారు. మొక్కలు నాటి, కాలుష్యాన్ని అరికడదామని పిలుపునిచ్చారు. అనంతరం ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రోగ్రామ్ అనలిస్ట్ షాలిని, సిబ్బంది సోనియా, ఉపాధ్యాయులు గంగాధరం, రాజకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త కృష్ణవేణి, శిరీష, సెల్వి, గౌతమి, ఉమ, భాగ్య పాల్గొన్నారు.

ప్రకృతిని రక్షించుకుందాం





మాట్లాడుతున్న జడ్జి గోపాలకృష్ణ, మొక్కలు నాటి నీరు పోస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న డీవైఈఓ ప్రభాకర్‌రాజు

పుత్తూరు: ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కోర్టు ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అదేవిధంగా బాలికల ఉన్నత పాఠశాలలో డీవైఈఓ ప్రభాకర్‌రాజు మాట్లాడుతూ ప్రకృతి ప్రసాదించిన గాలి, నీరు, నేల, అడవులు, కొండలు, జంతువులు, పక్షులు వంటి సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. ప్రకృతిపై ఆధారపడే మానవుని జీవితం ఉంటుందన్నారు. ఆధునికత పేరిట యువతీ యువకులే ఎక్కువ శాతం పర్యావరణాన్ని పాడుచేస్తున్నారని చెప్పారు. ఇది భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు కలిగిస్తుందన్నారు. పర్యావరణానికి ప్రమాదకరమైన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వినియోగించరాదని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి పరిరక్షించాలని కోరారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రఘుపతి, ఎంఈవోలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం, హెచ్‌ఎం ఆనంద్‌బాబు, ఉపాధ్యాయులు శోభారాణి, పుష్ప, భారతి, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులురెడ్డి, అధ్యాపకులు సాయివెంకటేష్, పద్మావతి, టి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఎంఈవోలు

నగరి: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖ అధికారులు శ్రీదేవి, నమశ్శివాయం తెలిపారు. వారు బుధవారం నగరి పట్టణంలో బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో గల స్వీట్ షాపులు, బట్టల షాపులు, పూల మార్కెట్లోని దుకాణాలను సందర్శించి పిల్లలను పనిలో పెట్టుకోరాదని యజమానులకు సూచించారు. బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు, చిత్తూరు చైల్డ్ లేబర్ అధికారులు కె.హేమాచారి, జగదీష్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అధికారి ఎస్.అరుణ, డీసీపీయూ వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆసుపత్రిలో బుధవారం పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో పౌష్టికాహార పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులు, వారి సహాయకులకు యథావిధిగా విజిటబుల్ ఫలావ్, వైట్ రైస్, గుడ్డు, కర్రీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటి పండు అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్ జి.నారాయణస్వామి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

నారాయణవనం: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు హెచ్‌ఎం శశికళ వెల్లడించారు. బుధవారం మీడియాతో ఆమె మాట్లాడుతూ గత ఏడాది ఉన్నత పాఠశాలను హైస్కూల్ ప్లస్‌గా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసి ఎంపీసీ, బైపీసీ గ్రూపుల అడ్మిషన్లకు అనుమతులు ఇచ్చిందన్నారు. తొలి ప్రయత్నంలోనే తమ విద్యార్థులు ప్రథమ ఇంటర్‌లో 82 శాతం ఉత్తీర్ణతతో 400 మార్కులకు పైగా సాధించారని అన్నారు. బాలికలకు మాత్రమే ఒక్కో గ్రూపులో 40 సీట్లకు అడ్మిషన్లు ప్రారంభమైనట్లు, నారాయణవనం, పరిసర గ్రామాల వారు 10వ తరగతి పాసైన తమ కుమార్తెలను బాలికల హైస్కూల్ ప్లస్‌లో చేర్పాలని సూచించారు.

కూలీల సంఖ్య పెంచండి



ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

శ్రీరంగరాజపురం: తయ్యూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఏపీఓ చంద్రశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి వందరోజులు పని దినాలు కల్పించాలని, కూలీల సంఖ్య పెంచి, వారి హాజరును ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ప్రతి కూలీకి ఒక పనిదినానికి గరిష్ఠంగా రూ.300 కేటాయించడం జరిగిందన్నారు. కూలీల హాజరులో ఏవైనా అవకతవకలు జరిగితే సంబంధిత అధికారిని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అనంతరం మండలంలోని శ్రీరంగరాజపురం, జీఎంఆర్ పురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట టీఏ నౌషాద్, రేఖ, బాల, రామమూర్తి, నోమేశ్వరి, ఫీల్డ్ అసిస్టెంట్ శకుంతల, జ్యోతి, రాజేష్ తదితరులు ఉన్నారు.

భూసార పరీక్ష.. నేలకు రక్ష

- దృష్టి సారిస్తే రైతుకు మేలు
- ఆచరణకు తరణమిదే



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

భాకరాపేట : రైతు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తాడు. తగిన దిగుబడి రాకుంటే నష్టాల పాలవుతాడు. ముందుగా నేల స్వభావం తెలుసుకుని ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు వేయాలి. ఏఏ పంటలు అనుకూలంగా ఉంటాయి అన్న వివరాలు ముందే తెలుసుకుని అందుకు అనుగుణంగా ఎరువులు వాడితే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. అంతేగాక పెట్టుబడులు కూడా తగ్గుతాయి. అధిక దిగుబడులు సాధించవచ్చు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా భూసార పరీక్షలు చేయిస్తోంది. తద్వారా రైతులకు పంటల సాగులో సాయం అందిస్తూ నష్టపోకుండా చూడడంతోపాటు అధిక దిగుబడి వచ్చేలా చర్యలు తీసుకుంటోంది.

భూసార పరీక్షలతో లాభాలు

- పొలంలోని ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాల స్థాయిని తెలుసుకోవచ్చు.
- మట్టి పరీక్షల ఫలితాల వల్ల ఏ పంట వేయాలి, ఏ పంటకు ఏయే ఎరువులను ఎంతెంత మోతాదులో వేయాలనే విషయాలు తెలుసుకోవచ్చు.
- పొలాల్లో చౌడు, ఆమ్ల స్థాయిని నిర్ధారించి వాటిని తగ్గించేందుకు అవసరమైన యాజమాన్య పద్ధతులు పాటించేందుకు అవకాశం ఉంటుంది.
- రసాయనిక ఎరువులపై అదనపు వ్యయాన్ని తగ్గించవచ్చు.

మట్టి నమూనాలు సేకరించే విధానం

- రైతులు తమ పొలంలోని ఒక ఎకరంలో కనీసం ఆరు నుంచి ఎనిమిది చోట్ల ఆరు నుంచి ఎనిమిది అంగళాల లోతు తవ్వి మట్టిని తీయాలి.
- సేకరించిన నమూనాలను బాగా కలిపి శుభ్రమైన గోనె సంచిలో వేయాలి. ఆ మట్టిని నీడలో పరిచి ఆరబెట్టాలి. గడ్డలు లేకుండా మెత్తటి పొడిగా చేయాలి.
- మట్టిని ఒక పొరగా చేసి నాలుగు భాగాలుగా విభజించాలి. ఇలా తీసుకున్న మట్టిని ఒక ప్లాస్టిక్ కవర్‌లో వేసి రైతు వివరాల చీటీని అందులో ఉంచాలి. వ్యవసాయాధికారుల ద్వారా భూసార పరీక్షల కేంద్రానికి పంపించాలి.
- ఈ మట్టిని భూసార పరీక్ష కేంద్రంలో పరీక్ష చేసి అందులో ఉన్న ఉదజని, లవణాలు, సేంద్రియ కర్బనాలు, నత్రజని, భాస్వరం, పొటాష్ తదితర పోషకాల స్థాయిని గుర్తిస్తారు. అధిక దిగుబడికి వాడాల్సిన ఎరువుల మోతాదును సూచిస్తారు.

పరీక్ష వెంటనే ఫలితాలు

గతంలో భూసార పరీక్షలు చేయించుకునేందుకు మట్టి నమూనాలను అధికారులకు ఇస్తే ఫలితాలు నెలలు గడిచినా వచ్చేవి కావు. దాంతో రైతులు వాడిన మందులనే వాడుతూ నష్ట పోయేవారు. ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ప్రస్తుతం ప్రతి మండలానికీ భూసార పరీక్ష కిట్లను అందజేసింది. మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రైతు పలాల్లోకి వెళ్లి పరీక్షలు జరిపి అక్కడికక్కడే ఫలితాలను తెలియజేస్తారు. ఆ రైతుకు సంబంధించి భూసార ఆరోగ్య కార్డును అందజేస్తారు.

పరీక్షలకిదే మంచి తరుణం

భూసార పరీక్షలకు ఇదే అనుకూలమైన సమయం. భూసార పరీక్షలు చేయించుకోవాలి. పరీక్షలు చేసుకున్న వెంటనే ఫలితాలను అందిస్తాం. పరీక్షల ద్వారా తమ భూముల్లో పోషక విలువలు తెలుసుకుని వాటికి అనుగుణంగా వాడుకోవాల్సిన ఎరువులను సూచిస్తాం. వాటిని వాడితే అధిక దిగుబడులు సాధించుకునేందుకు అవకాశం ఉంటుంది.

– ధనలక్ష్మి, వ్యవసాయాధికారి, చిన్నగొట్టిగల్లు